ప్రజాశక్తి

గురువారం 17 ఆగస్టు 2023 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

స్మార్ట్ టౌన్‌షిప్ భూమి కబ్జా

- ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న అధికార పార్టీ నాయకులు
- రూ.కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- తెలిసినా పట్టించుకోని అధికారులు

ఎంఐజి భూమిని కబ్జా చేసి మొక్కలు పెంచుతున్న దృశ్యం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములపై పడ్డారు. ఎవరి స్థాయిలో వారు దర్జాగా ఆక్రమిస్తున్నారు. ఈ కోవలోనే సుమారు రూ.11 కోట్ల విలువైన భూమిని మండలస్థాయి నాయకుడు ఒకరు కబ్జా చేశారు. దర్జాగా బోరు వేసి, మొక్కల పెంపకం చేస్తున్నారు. రహదారి పక్కనే ప్రభుత్వ భూమి కబ్జా జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. అధికారపార్టీ వారు కావడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

మండల పరిధిలోని రాయవరం గ్రామం లోని సర్వే నెంబర్లు 405/3, 408/2, 408/3, 412/1, 412/2 మొత్తం విస్తీర్ణం 14 ఎకరాలా 52 సెంట్లు (14.52) కాగా అందులో పది ఎకరాల ఇరవై రెండు సెంట్లు (10.22) గల భూమిని మధ్య ఆదాయ వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లస్థలాలను అందించే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తేది.25/01/2022 లో ఈ భూమిని ఎంపిక చేసి.. ఎంఐజీ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. లేఅవుట్ యొక్క మొత్తం ప్రాంతం 10.22 సెంట్లు, ప్రతిపాదిత రహదారుల ప్రాంతం 3.60 సెంట్లు, ఓపెన్ స్పేస్ ఏరియా 1.04 సెంట్లు, యుటిలిటీ ఏరియా 10 సెంట్లు, సౌకర్యాల ప్రాంతం 26 సెంట్లు, ప్లాట్ చేసిన ప్రాంతం 5.16 సెంట్లు, పారవేయాల్సిన ప్రాంతం 59 సెంట్లు, మొత్తం ప్లాట్ల సంఖ్య 113ను ఏర్పాటు చేసే విధంగా అధికారులు లేవుట్‌ను సిద్ధం చేశారు. అందులో 240 అడుగులు 29 ప్లాట్లు, 200 అడుగులలో 59 ప్లాట్లు, 150 అడుగులలో 8 ప్లాట్లు ఇతర సైజు ప్లాట్లు 17 కేటాయించి వివిధ శాఖల ▶ 2లో

'పరువు' దురహంకారమే.!

- బొట్లపాలెంలో దళిత యువతి, తల్లిపై దాష్టీకానికి ఇదే కారణం
- మరోసారి కులవ్యవస్థ క్రూరత్వాన్ని చాటిన వైనం
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు..
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పరువు దురహంకారాలు కొనసాగుతున్నాయి. తమ బిడ్డలు దళితులను పెళ్లి చేసుకుంటే తట్టుకోలేక పెత్తందారుల కుటుంబాల్లోని వాళ్లు దాష్టీకాలకు పాల్పడుతున్నారు. దర్శి మండలం, బొట్లపాలెంలో దళిత కుటుంబంపై సాగిన దాడి ఇందుకు నిదర్శనం. ఈ ఘటన యావత్తూ ఆధునిక సమాజానికి సవాలుగా మారింది. కులవ్యవస్థ క్రూరత్వాన్ని వికృతరూపాన్ని మరోసారి ప్రపంచానికి చాటింది. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరం ఐక్యంగా గ్రామాల్లో వ్యవహరించాల్సిన సమయంలో ఇలాంటి అమానవీయ ఘటనలు జరుగుతున్నాయంటే మనం ఎక్కడున్నామనేదీ ఆలోచించాల్సిన తరుణం. అంతరాలు పోలేదు. ఇప్పుడు ఇంకా పెరుగుతున్నాయా? అనేదీ ఆందోళన కలిగిస్తోంది.

బొట్లపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డి కుమార్తె భార్గవి, అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు సాయిరాం ఈ ఏడాది మార్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అందుకు బ్రహ్మారెడ్డి కుటుంబీకులు ఇష్టపడలేదు. వాళ్లిద్దరూ దూరంగా వెళ్లి ఉంటున్నారు. ఈ తరుణంలో దళిత కుటుంబంపై బ్రహ్మారెడ్డి, అతని కుటుంబసభ్యులు ఒకసారి దాడి కూడా చేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. రెండు గ్రూపులను పిలిచి మాట్లాడారు. ఫోన్‌లో భార్గవితో మాట్లాడించారు. తాను ఇష్టపూర్వకంగానే సాయిరాంను పెళ్లి చేసుకున్నానని, అతనితోనే జీవిస్తానని పోలీసుల సమక్షంలోనే తల్లిదండ్రులకు చెప్పింది. అదేరోజున దాడి చేసిన బ్రహ్మారెడ్డి, అతని భార్యపై బైండోవర్ కేసులు పెట్టారు. ఇరువర్గాలను ఇళ్లకు పంపారు. ఈ వ్యవహారం ఇంతటితో ఆగలేదు. తమ కుమార్తె జాడ కోసం బ్రహ్మారెడ్డి వెతుకుతున్నారు. ఇద్దరినీ ▶ 2లో

వైసిపి నేతలతో విజయసాయిరెడ్డి భేటీ

- బాపట్ల జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమీక్ష
- ప్రధానంగా పర్చూరు, చీరాల రాజకీయాలపైనే చర్చ?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి బాపట్ల జిల్లాలోని నియోజక వర్గాలతో నేతలతో సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయసాయిరెడ్డి బుధవారం బాపట్ల వచ్చారు. జిల్లాలోని వైసీపీ నేతలతో నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరుపుతున్నారు. పట్టణంలోని కోనభవన్‌లో ▶ 2లో

విజయసాయిరెడ్డితో భేటీ అయిన కరణం బలరాం, వెంకటేష్

కట్టుకున్నవాడే..కాలయముడై..

- వివాహమైన 11 నెలలకే ఘాతుకం
- కొత్తపేట, రోశయ్య కాలనీలో ఘటన

3లో ▶

స్మార్ట్ టౌన్‌షిప్ భూమి కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల వద్ద అనుమతుల కోసం దస్త్రాలను జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు పంపించారు. ఈ భూమిపై కన్నేసిన అధికార పార్టీకి చెందిన మండల స్థాయి నేత రంగంలోకి దిగారు. మెడికల్ కాలేజీకి కూతవేటు దూరంలో ఈ భూమి ఉండటంతో తన అనుచరగణంతో రెవెన్యూ రికార్డులల్లోని లొసుగులను తెలుసుకున్నారు. ఈ సర్వే నెంబర్లకు సంబంధించిన భూమి స్వరూపం ప్రభుత్వ భూమిగా ఉండటం.. అనుభవదారుని పేరు ఉండటంతో వారికి ఎలా వచ్చింది అంటూ ఆరా తీసి వారు అక్రమంగా ఆన్‌లైన్ చేరుకున్నారు అంటూ 1బి అండగల్ నందు పేర్ల నమోదు అయిన నలుగురు వ్యక్తులను భయభ్రాంతులకు గురి చేసి ఒక ఎంపీటీసీ ద్వారా వారికి కొంత నగదును ముట్టజెప్పి వారి వద్ద నుండి స్థిరాస్తి విక్రయ స్వాధీన అగ్రిమెంటును రాయించుకున్నారు. ఆ అగ్రిమెంటు ద్వారా ఆ భూమిని కాస్తా మార్కాపురం నియోజకవర్గంలోని కీలక నేత (షాడో ఎమ్మెల్యే) అండదండలతో తన హస్తగతం చేసుకొని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు చెందాల్సిన భూమి కాస్త కబ్జా చేసేశాడు. ఆ భూమిలో ముళ్ల పొదలను యంత్రాలతో తొలగించాడు. చదును చేసి బోరు, పైప్‌లైన, డ్రిప్పు ఏర్పాటు చేశాడు. వివిధ రకాలైన మొక్కలు సాగు చేసి, రూ.కోట్ల విలువైన భూమిని సొంతం చేసుకున్నాడు. అధికార పార్టీకి చెందిన కీలక నేత అండదండలతోనే ఈ ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని గ్రామస్తులు, అధికార పార్టీకే చెందిన కొందరు అంటున్నారు.

ఆ భూమి విలువ రూ.10 కోట్ల పైమాటే..

వైసీపీ నాయకుడు కబ్జా చేసిన భూమి జాతీయరహదారి పక్కనే ఉంది. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ భూమికి ఇటీవల కాలంలో మంచి డిమాండ్ వచ్చింది. పైగా మెడికల్ కళాశాలకు కూత వేటు దూరంలో ఈ భూమి ఉండటంతో ఎకరం రూ.కోటికి పైగా పలుకుతోంది. ఈ లెక్క ప్రకారం 10.22 ఎకరాల విలువ రూ.11 కోట్లకు పైగా ఉంటుంది. మార్కాపురం నుండి జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లే దారిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి పక్కనే ఉంది. రెవెన్యూ అధికారులు అటు వెళ్లినా కబ్జా విషయం అర్థమవుతుంది. అయినా పట్టించుకోవడం లేదు. విలువైన భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూశాఖకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు ఈ భూమిని పరిశీలించి కబ్జారాయుళ్ల చెర నుండి ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే శవాన్ని దహనం చేస్తున్న దృశ్యం

స్మశానానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-కొండపి

మండలం కేంద్రమైన కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెంలో సశ్మానం స్థలం లేక గ్రామస్తులు రోడ్డు వెంబడే శవాలను దహనం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులతో పాటు రోడ్డు వెంట వెళ్లే పాదాచారులు భయాందోళనకు గురిఅవుతున్నారు. వివరాలలో వెళ్లగా గతంలో కట్టావారిపాలెంలో పోలేరమ్మ గుడి ఉత్తరం వైపున 18.50 సెంట్లు భూమిని స్మశానానికి కేటాయించడం జరిగింది. అయితే దానికి కొందరు వ్యక్తులు అక్రమించుకోవడంతో దహన సంస్కారాలకు స్థలం లేకపోవడంతో రోడ్డు వెంబడే దహనం చేస్తున్నారు. దీంతో ప్రజలు, అక్కడ ఉన్న యంఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, హ్యాపి కిడ్స్ స్కూల్ విద్యార్థులు, గుడికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ నాయకుల మూడు నెలల క్రిందటే తహశీల్దారుకు, పంచాయతీ కార్యదర్శికి అర్జీలు ఇచ్చిన స్పందించలేదని స్థానికులు తెలిపారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపిడివో విజయ అన్నారు. బుధవారం మండలంలోని స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ సచివాలయం జిఆర్ సర్వే పూర్తి అయ్యింది కానీ ఇంకా విద్యార్థులు బడి బయట ఉన్నారని, వారందరిని గుర్తించి బడిలో చేర్చాలని, అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందించిన జగనన్న విద్యాకానుక, బయోమెట్రిక్ 100 శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఎంఈవో మస్తాన్ నాయక్ మాట్లాడుతూ బడి బయల ఒక్కరూ కూడా లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించాలన్నారు. నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. త్వరలో పాఠశాలకు నెట్ కనెక్షన్ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మస్తాన్ నాయక్, కొండల్‌రావు, ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి, పిఆర్‌పిలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఎదురు బొంగుల లారీ పట్టి వేత

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం దిగువ మెట్ట అటవీప్రాంతం అభయారణ్యంలో ఎదురు బొంగులు నరికి లారీలో తరలిస్తుండగా మంగళవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. అయితే సామాన్యులు అభయారణ్యంలోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేసే అటవీశాఖ అధికారులు, అభయారణ్యంలో ఎదురు బొంగులు నరికి లారీల్లో తరలిస్తున్న వారిపై ఎలాంటి కేసులు నమోదు చేస్తారో, ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలని ప్రజలు వేచి చూస్తున్నారు. ఎదురు బొంగులు అక్రమ రవాణా ఎంత కాలం నుండి కొనసాగుతున్నదోనని ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు. డివిజన్ పరిధిలో గత జూలై నెలలో ఎదురు బొంగుల కూపులు కొట్టి అటవీశాఖ డిపోల్లో పెట్టి వేలం పాటలు నిర్వహణ ముగిసిపోయింది. మంగళవారం రాత్రి ఎదురుబొంగుల లారీ అటవీశాఖ అధికారులకు పట్టుబడింది. పట్టుబడ్డ ఎదురు బొంగుల లారీ అధికారపార్టీకి చెందిన నాయకుడిది కావడంతో అంటవీశాఖ పై స్థాయి అధికారులు వివరాలు గోప్యంగా ఉంచి, కేసు లేకుండా చేసేందుకు అధికారపార్టీ నాయకుడికి సహకరించే ముమ్మర ప్రయత్నాల్లో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'పరువు' దురహంకారమే.!

(మొదటిపేజీ తరువాయి)

విడదీసి తమ కుమార్తెను ఇంటికి తెచ్చుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. సాయిరాం అక్క కామునూరి మౌనిక తన ఇంటికి సమీపంలోని కుళాయి వద్ద నీళ్లు పట్టుకునే సమయంలో గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, అతని భార్య పుల్లమ్మ వచ్చి దాడి చేశారు. కళ్లలో కారం కొట్టారు. కొట్టుకుంటూ.. లాక్కుంటూ.. వాళ్ల ఇంటికి ఈడ్చుకొనిపోయారు. కాళ్లతో తన్నుతూ.. చేతులు, కర్రలతో కొట్టుకుంటూ లాక్కెళ్లారు. అర్ధరాత్రి ఈ దాష్టీకం జరిగింది. మౌనిక తల్లి కూడా తమ కుమార్తెను కొట్టవద్దంటూ వచ్చి అడ్డుకోగా ఆమెనూ తీవ్రంగా కొట్టారు. పక్కన ఈడ్చిపడేశారు. కుళాయి వద్దనే మౌనికను కిందపడేసి బ్రహ్మారెడ్డి ఆమెపై కూర్చొని కత్తితో పొడవబోగా ఆమె చేయి అడ్డుపెట్టింది. దీంతో చేతికి తీవ్ర గాయమైంది. బ్రహ్మారెడ్డి ఆమెను బూతులు తిడుతూ.. లాక్కొని వెళ్లి తన ఇంటిలో వరండాలోని స్తంభానికి కట్టేశారు. మా పైనే కేసులు పెడతారా? వెనక్కు తీసుకుంటారా? లేదా? అని చంపబోయారు. గొడ్డలి వెనుకభాగంతో కొట్టారు. అంతటితో ఆగకుండా పెట్రోలు పోసి చంపాలనే యత్నం కూడా చేశారు. అక్కడున్న కొందరు ఆ యత్నాన్ని ఆపారు. అదే సమయంలో బాధితురాలి తల్లి పోలీసులకు ఫోన్ చేయగా వెంటనే అక్కడకు దర్శి పోలీసులు చేరుకున్నారు. బాధితురాలిని నిందితుల నుంచి విడిపించి.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి చేర్పించారు. ఈ నేరానికి పాల్పడిన నిందితులు బ్రహ్మారెడ్డి, అతని భార్య పుల్లమ్మను దర్శి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ మల్లికగర్గ్ వెల్లడించారు. బుధవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఘటన వివరాలు వెల్లడించారు. వారిపై పెట్టిన కేసులను, సెక్షన్లను వివరించారు. హత్యాయత్నం కేసుతో పాటు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దర్శి డిఎస్పీ అశోక్‌వర్ధన్ సమావేశంలో ఉన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న తహశీల్దారు

బాధితులకు పోలీసుల రక్షణ

బొట్లపాలెం దళిత బాధిత మహిళలు మౌనిక, అనురాధ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ నుండి బుధవారం డిశ్చార్జి అయ్యి.. ఇంటికి వచ్చారు. దర్శి తహశీల్దార్ వెంకటేశ్వర్లు బాధితులను పరామర్శించారు. ఇద్దరు కానిస్టేబుళ్లను బాధిత కుటుంబం వద్ద రక్షణగా ఉంచినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఉత్తమ అవార్డు అందుకున్న హనుమంతరావుకు సన్మానం

ప్రజాశక్తి-కొండపి

విద్యాశాఖ తరపున 2023 సంవత్సరానికి జిల్లా మార్గదర్శిని (డెడికేటెడ్ మెంటార్) టీమ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన కె.హనుమంతరావును స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నందు ఉత్తమ అవార్డు అందచేశారు. ఈ సందర్భంగా బుదవారం నాడు మండలంలోని వెన్నూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు అభినందన సభ ఏర్పాటు చేసి హనుమంతరావును ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ అవార్డు అందుకున్న హనుమంతరావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.భారతి, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

వైసిపి నేతలతో విజయసాయిరెడ్డి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, రేపల్లె వైసిపి ఇన్‌ఛార్జి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య, పర్చూరు ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్, చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, ఎమ్మెల్సీ పోతుల సునీతతో విజయసాయిరెడ్డి సమావేశమయ్యారు.ఆయా నియోజకవర్గాల్లో స్థానికంగా ఉన్న సమస్యలు, పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వారితో చర్చించినట్లు తెలుస్తోంది. గురువారం జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసిన నాయకులు, పార్టీ శ్రేణులతో విజయసాయిరెడ్డి సమావేశం కానున్నారు. ఇందుకోసం నియోజకవర్గంలో 20 నుంచి 25 మంది నేతలతో కూడిన జాబితాను రూపొందించారు. వైసీపీ జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ పరిశీలకులతో విడివిడిగా రీజినల్ కోఆర్డినేటర్ సమావేశం అవుతున్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల సమీక్ష జరుగుతున్నప్పటికీ చీరాల, పర్చూరు నియోజకవర్గాల సమీక్ష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవల చీరాలలో కరణం, ఆమంచి గ్రూపుల మధ్య రామన్నపేట వార్డు ఎన్నికల నేపథ్యంలో జరిగిన గొడవలు, ఘర్షణ పరిణామాల నేపథ్యంలో బాపట్లలో సమీక్ష సమావేశాలు జరుగుతున్న కోనభవన్ వద్ద విస్తృతమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చీరాల, పర్చూరు ఈ రెండు నియోజకవర్గాల్లో ఆమంచి కృష్ణమోహన్ వ్యవహార శైలిపై అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రెండు నియోజకవర్గాల నుంచి ఇరువురు నేతల అనుచరులు విజయసాయిరెడ్డిని కలిసేందుకు వస్తున్నారు.

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న కె రవీంద్రారెడ్డి జిల్లా ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపికై రాష్ట్ర ఇంచార్జి మంత్రి మేరుగ నాగార్జున చేతులు మీదుగా ఉత్తమ తహశీల్దార్‌గా ప్రశంసా పత్రంతో పాటు అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు, రెవెన్యూ ఉద్యోగులు శాలువలు, పూలమాలలతో ఆయనను ఘనంగా సన్మానించారు. రవీంద్రారెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు

PODILI NAGARAPANCHAYAT

e-procurement tender notice Roc.No.115/2021/E1- 1, Dt: 16.08.2023
NIT.No. 23/2023-24/PNP (ONE Works).
General funds -Rs: 40.00 Lakhs

Further Details can be seen at "e-procurement Marketplace in www.apeprocurement.gov.in officer inviting bids Commissioner- Podili Nagara Panchayat-Prakasam (Dt), Andhra Pradesh.
Ph No:9494881376

Sd/-XXXXXXXXXXXXXX
Commissioner
Podili Nagara Panchayat

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. NO. 738/2022

యేల్చూరి సత్యనారాయణ ......వాది
వర్సెస్
పులి వెంకట లక్ష్మీప్రసాదు ... ప్రతివాది
To,
పులి వెంకట లక్ష్మీప్రసాదు,
తండ్రి లేట్ పులి వెంకటరత్నం,
వయస్సు 49 సం.లు, హిందు,
చోళ్లవీడు గ్రామం, రాచర్ల మండలం,
గిద్దలూరు తాలూకా, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది, దావా పరిహారం రాగోరి గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీపై దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పైకోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలుపుటకు వాయిదా 13.09.2023వ తేదీన యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం..లకు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీరు పై కోర్టులో మీ ఆక్షేపణలుంటే తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
స్థలం : గిద్దలూరు. శ్రీ డి.సిద్దయ్య,
తేది. 16-08-2023 వాది తరపు అడ్వకేటు,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO.1319/2022
in
O.S.NO. 738/2022

యేల్చూరి సత్యనారాయణ ...పిటిషనర్
వర్సెస్
పులి వెంకట లక్ష్మీప్రసాదు ....రెస్పాండెంట్
To,
పులి వెంకట లక్ష్మీప్రసాదు,
తండ్రి లేట్ పులి వెంకటరత్నం,
వయస్సు 49 సం.లు, హిందు,
చోళ్లవీడు గ్రామం, రాచర్ల మండలం,
గిద్దలూరు తాలూకా, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్, పిటిషన్ పరిహారం రాగోరి గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో మీ పై పిటిషనను దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో మీరు పైకోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలుపుటకు వాయిదా 13.09.2023వ తేదీన యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం..లకు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీరు పై కోర్టులో మీ ఆక్షేపణలుంటే తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
స్థలం : గిద్దలూరు. శ్రీ డి.సిద్దయ్య,
తేది. 16-08-2023 వాది తరపు అడ్వకేటు,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా,

ప్రజాశక్తి
గురువారం 17 ఆగస్టు 2023

మహిళలకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-దరిశి

అమూల్ పాల కేంద్రాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ఎంపిడిఒ కె. కుసుమకుమారి అన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథకం కార్యాలయంలో ఎపిఎం విజయకుమార్ అధ్యక్షతన విఎలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దరిశి క్లష్టరు ఏరియా కోఆర్డినేటరు వసుంధరాదేవి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు లోన్లు తీసుకునే లబ్ధిదారులను ఎంపిక చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజరు పవన్‌కళ్యాణ్, విఎలు పాల్గొన్నారు.

అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు 1141

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నాడు అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు 1141 ఉన్నాయని వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రానికి ఎన్.ఎన్.కండ్రిక, పెట్లూరు, వర్ధినేనిపాలెం, జగ్గరాజుపాలెం, కట్టావారిపాలెం, నరసింగోలు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు 1141 బేళ్లను అమ్మకానికి ఉంచారు. అందులో 1094 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 47 బేళ్లు వివిద కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.275, అత్యల్ప ధర కిలో రూ.150, సరాసరి ధర కిలో రూ.265.05 పలికిందన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కొణిదెన గ్రామంలో చోటు చేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.. కొణిదెన గ్రామానికి చెందిన కొమ్మరగిరి ఏడుకొండలు(50) బుధవారం బావిలో చేపలు పట్టేందుకు వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతి చెందాడు.

జగన్‌ను మళ్లీ గెలిపించాలి

ప్రజాశక్తి మద్దిపాడు

మండల పరిధిలోని ఇనమనమెల్లూరులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు హాజరయ్యారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మరలా గెలిపించాలని అది మనందరి కర్తవ్యం అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, చింతల శ్రీనివాసరెడ్డి, గుడ్డపాతల రవి, వెంకటేశ్వర్లు, పూనాటి అప్పారావు, ప్రసన్న, పూర్ణచంద్రరావు, ఎర్ర దశరథ, పిట్టల ఆంజనేయులు, ఎంపీటీసీలు బొమ్మల ప్రభుదాసు, పైనం ప్రభాకర్, సర్పంచులు నాగ మల్లీశ్వరి, గ్రామ సర్పంచి ఏకుల ఏడుకొండలు, నాయకులు ఆకుల శ్రీనివాసరావు, గద్దె జాలయ్య, జలగ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కట్టుకున్నవాడే.. కాలయముడై..

- వివాహమైన 11 నెలలకే ఘాతుకం
- కొత్తపేట రోశయ్య కాలనీలో ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిఎస్పి ప్రసాద్

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్పీ ప్రసాద్

ప్రజాశక్తి-చీరాల

కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను గొంతు నులిమి భర్త హత్య చేసిన సంఘటన వేటపాలెం మండలం, కొత్తపేట పంచాయతీ పరిధిలోని రోశయ్య కాలనీలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం తిప్పాలకట్ట గ్రామానికి చెందిన అమర్తలూరి డేవిడ్, పండు దంపతుల కుమార్తె రోహిణి (28)కి వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ రోశయ్య కాలనీకి చెందిన డక్కుమళ్ల పవన్ కళ్యాణ్‌తో గత ఏడాది సెప్టెంబర్‌లో వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ తరచూ గొడవ పడుతూ అలానే జీవనం సాగిస్తున్నారు. ఇటీవల పెద్దలు సర్ది చెప్పి భార్యాభర్తలిద్దరినీ మందలించారు. మంగళవారం రాత్రి భార్యాభర్తలు అరుచుకొని ఘర్షణ పడ్డారు. ఘర్షణలో భార్య రోహిణిని గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు. హత్య విషయాన్ని కుటుంబ సభ్యులకు పవన్ కళ్యాణ్ తెలియజేసి వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం అందుకున్న డిఎస్పి ప్రసాద్ ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి హత్య జరిగిన ప్రాంతంలో వివరాలు సేకరించారు. అయితే తమ కూతురిని భర్త, కుటుంబ సభ్యులు వివాహం జరిగినప్పటి నుంచి అనుమానిస్తూ వివాహేతర సంబంధాన్ని అంటగడుతూ నిత్యం వేధించేవారని తమతో అనేకసార్లు చెప్పిందని అన్నారు. హత్యకు ముందు కూడా తమతో ఫోన్లో ఏడుస్తూ మాట్లాడిందని, తమ బిడ్డను అత్త ఇంటి వారే భర్తతో కలిసి హత్య చేసారని పోలీసుల ఎదుట మృతురాలి కుటుంబ సభ్యులు వాపోయారు. తమ కుమార్తెను చంపిన పవన్‌కల్యాణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి పోలీసులు, వైద్యుల సమక్షంలో మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. టూ టౌన్ ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రుల భవిష్యత్‌కు గ్యారంటీ 'టిడిపి'తోనే

టిడిపి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసిపి పాలనలో అదోగతి పాలయ్యారని, మనందరి భవిష్యత్‌కు గ్యారంటీ ఒక్క తెలుగుదేశం పార్టీతో సాధ్యమవుతుందని మార్కాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్లు కొప్పుల శ్రీనివాసులు, సంధ్యారాణిల ఆధ్వర్యంలో టిడిపి చేపట్టిన 'భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుల నారాయణరెడ్డి వైసిపి పాలనలో సామాన్యులు జీవనం సాగించలేనంతగా ధరలన్నీ పెరిగాయన్నారు. కొనలేం... తినలేం అన్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. పైసా భారం మోపనని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదన్నారు. ఒక్క చాన్స్ కావాలని కోరారని, జనం కూడా ఈ ఒక్కసారితో సరిపెడతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికి పోవాల్సిందేనన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల ఎన్నికల హామీలను విడుదల చేయగా వాటిని ఇంటింటా వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ రాధిక మల్లికార్జున, టిడిపి నియోజకవర్గ నాయకుడు కందుల రామిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, రాష్ట్ర నాయకులు డి.మస్తానయ్య, మట్టం వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ బీసీ నాయకుడు డి.నాసరయ్య, ఆ పార్టీ స్థానిక నాయకులు పిన్నిక శివ, సయ్యద్ గఫార్, కొప్పుల వెంకటేశ్వర్లు, కనిగిరి బాలవెంకటరమణ, పిహెచ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌టుహౌస్ సర్వే 97 శాతం పూర్తి

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు బిఎల్‌వోలు హౌస్ టు హౌస్ సర్వే 97శాతం, ఓటర్ సర్వే 86 శాతం పూర్తి చేశారని కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈఆర్‌వో నారదముని తెలిపారు. బుధవారం నాడు కొండపి తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ పొలిటికల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపియం మండల నాయకులు కెజి మస్తాన్ మాట్లాడుతూ టంగుటూరు మండలంలోని పొందురూ పంచాయతీ పరిదిలోని లక్ష్మక్కపాలెం గ్రామంలో 250 మంది ఓటర్లు ఉన్నారని, వారి ఓటు హక్కు వినియోగించుకోవాలంటే రెండు కిలోమీటర్లు లోపు దూరంలో ఉన్న పొందురుకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తుందని తెలిపారు. లక్ష్మక్కపాలెం కూడా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎటువంటి సమస్యలు ఉండవని ఈఆర్‌వోకి తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా నారదముని మాట్లాడుతూ ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలియచేశారు. ఓటరు సర్వేకు ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉందని మిగిలిన మూడు శాతం ఇంటింటిసర్వే, 14శాతం ఓటరు సర్వే కూడా త్వరగా పూర్తి చేసి తప్పులు లేని ఓటరు లిస్టు తయారు చేయగలగాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిదులు పాల్గొన్నారు.

'బొట్లపాలెం' కేసులో ఎస్ఐకు ఎస్పి అభినందన

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని బొట్లపాలెం గ్రామంలో దళిత మహిళలు అగ్రకులాల దాడి జరుగుతున్న సంఘటన స్థలానికి అర్ధరాత్రి వెళ్లి రక్షించినందుకు జిల్లా ఎస్పి మల్లికాగార్గ్, డిఎస్పి అశోక్‌వర్ధన్‌రెడ్డికి, సిఐ జె రామకోటయ్యకు, ఎస్ఐ రామక్రిష్ణకు ప్రశంసాపత్రాలు అందించారు. స్పందించిన ఎస్ఐ రామక్రిష్ణ టీమ్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. దళిత మహిళలు అయిన మౌనిక, అనూరాధలను రక్షించడంలో ఎస్ఐ పోషించిన పాత్ర అభినందనీయమని ఎస్పి మల్లికగార్గ్ కొనియాడారు. **బహ్మారెడ్డి, పుల్లమ్మలకు 14 రిమాండ్:** బొట్లపాలెంలో ఎస్‌సి మహిళలు కామునూరి మౌనిక, జక్కుల అనురాధల పై మారణాయుధాలతో దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, గంగిరెడ్డి పుల్లమ్మలకు దరిశి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈనెల 29వ తేది వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రామక్రిష్ణ వెల్లడించారు. జిల్లా ఎస్పి మల్లికాగార్గ్ ఒంగోలులోని విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వివరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో దరిశి డిఎస్పి అశోక్‌వర్ధన్‌రెడ్డి, సిఐ జె రామకోటయ్యలు పాల్గొన్నారు.

హత్య కేసులో తండ్రి అరెస్టు

ప్రజాశక్తి-దరిశి

ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో ఈనెల 14వ తేదిన మంచంమీద నిద్రిస్తున్న కుంచాల సుబ్బారావును తండ్రి కుంచాల వెంకటేశ్వర్లు గొడ్డలితో నరికి చంపిన కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్లు స్థానిక సిఐ జె రామకోటయ్య తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మృతుడు కుంచాల సుబ్బారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని కుటుంబాన్ని పట్టించుకోకుండా చెడు వ్యసనాలకు బానిసై భార్య, తల్లిదండ్రులను డబ్బులు ఇవ్వమని లేకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపినట్లు సిఐ రామకోటయ్య తెలిపారు. నిజంగా కుమారుడు తనను చంపుతాడేమోనని భయపడిన సుబ్బారావు నిద్రిస్తున్న కొడుకుని గొడ్డలితో పట్టపగలే నరకడంతో చనిపోయాడని తెలిపారు. మృతుని భార్య వెంకటలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో ముండ్లమూరు ఎస్ఐ యు క్రిష్ణయ్య, సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పిలు అభినందించినట్లు సిఐ రామకోటయ్య తెలిపారు.

92 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-కొండపి

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల దగ్గర నుంచి 92 మద్యం సీసాలు పట్టుకున్నట్లు కొండపి సర్కిల్ సిఐ పాండురంగారావు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన బండి అయ్యన్న ప్రభుత్వం మద్యం దుకాణాల నుంచి పదుల సంఖ్యలో మద్యం సీసాలు కొనుగోలు చేసి పలు ప్రదేశాల్లో నిల్వ చేసి గ్రామస్తులకు విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో కొండపి పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 79 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాదీనం చేసుకొని నిందితుడిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అలాగే కొండపి గ్రామానికి చెందిన కొణిజేటి శ్రీనివాసరావు మద్యం విక్రయిస్తుండగా స్థానికులు అందించిన సమాచారంతో తనిఖీ చేయడంతో 13 మద్యం సీసాలు లభించాయి. వాటిని సీజ్ చేసి అతడిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-తర్లుపాడు

ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని మేకలవారిపల్లి టోల్ ప్లాజా వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు... తెలంగాణ రాష్ట్రం గోపాలపురం గ్రామానికి చెందిన తుంపాల నాగరాజు(20) తర్లుపాడు మండలం మేకలవారి పల్లి గ్రామ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఏమైందో ఏమో టోల్‌ప్లాజా ఆఫీసు గదిలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతడు తల్లి శివ పార్వతి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లికి చెందిన ప్రముఖ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు నక్కా సదాశివరావు(43) బుధవారం మృతి చెందారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలో రెండు దశాబ్దాలుగా డీఎస్సీ, టిటిసి, పోలీస్ కానిస్టేబుల్, వీఆర్వో తదితర కోచింగ్ పరీక్షలకు శిక్షణ అందించి వేలాది మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపిక చేయించిన సదాశివరావు శ్రీకాకుళం జిల్లా పలాసలో బుధవారం మృతి చెందినట్లు సమాచారం అందింది. ఆయన భార్య స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా వెళ్లి సదా మాస్టారు మృతి చెందారు.

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి

బల్లికురవ రూరల్:మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి తానిపర్తి యజ్రయ్య వయస్సు(30) విద్యుత్ షాకుతో మృతిచెందాడు. బుధవారం తన స్వగ్రామంలోనే తాపీ మేస్త్రీగా పనిచేసేందుకు వెళ్లి ఇంటి పనిచేసే క్రమంలో 11 కెవి విద్యుత్ వైర్లను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

అక్రమ తవ్వకాలతో ప్రకృతి విధ్వంసం

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు ● పంట భూములను సైతం తొలిచేస్తున్న అక్రమార్కులు ● తవ్వకాలను అడ్డుకున్న ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-చిన్నగంజాం

ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. వ్యవసాయ సాగుకు అనువైన భూములను సైతం అక్రమంగా తవ్వేస్తున్నారు. సాగుభూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని తెలిసినా కూడా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక దిబ్బలను తవ్వకునేందుకు మైనింగ్ శాఖ అనుమతులు ఇస్తుంది. కానీ అందుకు విరుద్ధంగా వ్యవసాయ యోగ్యమైన భూముల్లో లోతుగా తవ్వేస్తూ చెరువులను చేస్తున్నారు. రైతు తన సొంత భూమి అని చెబుతున్నప్పటికీ అలా తవ్వితే పక్కనున్న వ్యవసాయ భూములు కూడా సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. దీని వల్ల మొత్తం వ్యవసాయం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇంత తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడం, అక్రమ తవ్వకం దారులకు పరోక్షంగా సహకరించడం విమర్శలకు కారణమవుతోంది. ఇసుక అక్రమ తవ్వకందారులు తమ స్వార్ధం కోసం ప్రకృతి వనరులను లూటి చేయడాన్ని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు అడ్డుకున్నారు. చిన్నగంజాం పరిధిలోని సర్వే నెంబరు 128, 129, 828, 829, 830, 831లలో సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు భూముల పంచాలని 1990లో భూ పోరాటం చేశారు. దీంతో అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్, మండల స్థాయి అధికారులు ఆయా సర్వే నెంబర్లలోని భూములను పరిశీలించారు. మండలంలోని యానాదులకు ఎస్‌టి జాబితా కింద ఆ భూములను సాగుచేసుకునేందుకు తాత్కాలిక పట్టాలను మంజూరు చేశారు. వీటిని మండల

అక్రమ తవ్వకాలు అడ్డుకున్న ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు

రికార్డులలో కూడా నమోదు చేశారు. కొంతమంది ఇసుక అక్రమార్కులు ఆ భూములను కాజేసే దురుద్దేశంతో దొంగ పట్టాలను సృష్టించారు. అధికారులను, పోలీసులను చివరికి కోర్టును కూడా తప్పు దారి పట్టించారని బాధితులు ఆరోపిస్తున్నారు. మాగాణి రైతులను సైతం భయభ్రాంతులకు గురి చేసి ఆ భూముల్లో ఇసుకను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా సాగిస్తూ ప్రకృతి వనరులను సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని గతంలో బాధితులు ధర్నాలు, నిరసనలు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు జోక్యం చేసుకుని అక్రమాలను అడ్డుకోవాలని సిపిఎం నాయకులు జి ప్రతాప్ అధికారులకు స్పందన కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అయినా అధికారులు స్పందించలేదు. దీంతో ఐక్యవేదిక నాయకులు జి ప్రతాప్ కుమార్, కడవకుదురు ఎంపిటీసీ ఆమంచి సుబ్బారావు, చిన్నగంజాం ఎంపీటీసీ సుబ్బారెడ్డి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాదర్తి ప్రకాష్ సారథ్యంలో సోపిరాల గ్రామ రైతులతో కలిసి సర్వే నెంబర్ 828లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను, ప్రొక్లెన్‌ను, ఒక బొలేరో వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో స్పందించిన తహసీల్దార్ పార్వతి, ఎస్ఐ సురేష్ ఇతర అధికారులు స్పందించారు. నేరుగా సంఘటన స్థలానికి వచ్చారు. పరిస్థితిని సమీక్షించారు. సదరు భూములను పరిశీలించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అధికారుల సమక్షంలోనే ఆందోళనకారులు ఇసుకను తరలించే మార్గాన్ని ధ్వంసం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుని వ్యవసాయ యోగ్యమైన భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలను అడ్డుకున్న వారిలో అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళలు, పాదర్తి దానియేలు, ప్రసాద్, చిన్నగంజాం మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, సుభాని, ముస్లిం మైనారిటీ యువకులు పాల్గొన్నారు.

జేపీ కంపెనీ వాహనాలు: ఎస్ఐ కె సురేష్

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న సమయంలో అదుపులోకి తీసుకున్న వాహనాలు, వ్యక్తులు జెపి కంపెనీకి చెందినవని తెలిసి వదిలేశామని చిన్నగంజాం ఎస్ఐ సురేష్ చెప్పారు. అనుమతులు లేకుండా చేస్తున్న అక్రమ తవ్వకాలను ఆపేశామని తెలిపారు.

ఏఎల్ఓ సాయిజ్యోతికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ

ఏఎల్ఓ సాయిజ్యోతికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పీ సాయిజ్యోతికి ప్రతిభా పురస్కారం దక్కింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆమెకు ప్రతిభా పురస్కారం అందజేశారు. విధి నిర్వహణలో ఆమె చూపిన ప్రతిభ ఆధారంగా ఈ పురస్కారం ప్రభుత్వం అందించింది. ఈ సందర్భంగా సాయిజ్యోతికి పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సిఐ వేణుగోపాల్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ

సీఐ వేణుగోపాల్ రెడ్డికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల రూరల్ ప్రాంతంలో శాంతి భద్రతల రక్షణ కోసం శక్తివంచన లేకుండా విధులు నిర్వహించిన సీఐ జి వేణుగోపాల్ రెడ్డికి ఉత్తమ ప్రతిభ పురస్కారం దక్కింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బాపట్ల పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రశంసాపత్రం దక్కినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. సిఐ వేణుగోపాల్ రెడ్డికి పలువురు అధికారులు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

బాపట్లలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-బాపట్ల

భారీ పతాకతో ర్యాలీ దృశ్యం

బాపట్ల పట్టణంలో బుధవారం నా మట్టి నా దేశం ర్యాలీ జరిగింది. జాతీయ జెండాను చేతబూనిన విద్యార్థులు, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అశేష ప్రజానీకం భాగస్వాములై జిల్లా కేంద్రమైన బాపట్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా ప్రారంభించారు. బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండు, అంబేద్కర్ సర్కిల్, రథం బజార్, జిబిసి రోడ్డు, ద్వారా పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ర్యాలీలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, మునిసిపల్ డి శ్రీనివాసులు, టిపిఓ లక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ రక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న జగనన్న భూ హక్కు, భూ పరిరక్షణ పథకం రైతులు సద్విని యోగం చేసుకోవాలని తహశీల్దార్ డి మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో కారుమూరు గ్రామంలో చివరి దశలో ఉండగా, అరవపల్లి గ్రామంలో సమగ్ర భూ సర్వే చేపట్టడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా భూ యజమానులకు భూమి శాశ్వత హక్కుతో పాటు, రక్షణ కూడా కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పేర్కొన్నారు.

14 నెలలుగా జీతాలు ఇవ్వలేదని..

కొనసాగుతున్న ధర్నా

ప్రజాశక్తి-చీరాల

వాడరేవు పంచాయతీ కార్మికులకు జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వారికి జీతాలు ప్రభుత్వం చెల్లించాలని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. బుధవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల మండలం వాడరేవు పంచాయతీలో 14 నెలలుగా జీతాలు లేక ఆకలితో అల్లాడుతున్నారన్నారు. నెల జీతం ఆలస్యం అయితేనే ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో 14 జీతాలు లేకపోతే ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. కరోనా కాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన పంచాయతీ కార్మికుల పట్ల ఇలాంటి వివక్షత తగదన్నారు. పదో తేదీ నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శికి అర్జీ ఇచ్చినా స్పందన లేదని, వెంటనే పై అధికారులు జోక్యం చేసుకొని గ్రామంలో పారిశుధ్య సమస్య పెరక్కుండా సమ్మె నివారించి పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చీరాల మండల కార్యదర్శి ఎం వసంతరావు, పంచాయతీ యూనియన్ నాయకులు జి సురేష్, కోటేశ్వరరావు, సాల్మన్, మరియమ్మ, గాంధీ, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో విద్యార్థులకు బంగారు పతకం

ప్రజాశక్తి-అద్దంకి

బంగారు పతకం సాధించిన విద్యార్థులతో భాష్యం ప్రిన్సిపాల్, సిబ్బంది

గుంటూరులో దేశ స్థాయిలో ఈ నెల 15వ తేదీ జరిగిన స్కేటింగ్ పోటీల్లో పట్టణంలోని బంగ్లా రోడ్‌లోని భాష్యం ఉన్నత పాఠశాలలో 8,6 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక బంగ్లా రోడ్‌లోని భాష్యం ఉన్నత పాఠశాలలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ జివిఎస్‌ఆర్ శాస్త్రి, హెచ్‌ఎం కాకాని కల్పన పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ సోమవారం గుంటూరులోని రెయిన్ ట్రీట్ పార్క్‌లో శివగంగ స్కేటింగ్ క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ బెల్గాం, స్కేటింగ్ కోచ్చేస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వరంలో దేశ స్థాయిలో 5 గంటల పాటు నిర్విరామంగా స్కేటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అద్దంకి భాష్యం ఉన్నత పాఠశాలలో 8,6 తరగతుల విద్యార్థులు ఆరెపాక అఖిల్, బత్తినేని ప్రదీప్ చౌదరి పాల్గొని బంగారు పతకాలను సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి-రేపల్లె

స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ఉద్యమ వీరుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి గౌడ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా పార్లమెంటు గౌడ సాధికార కమిటీ కన్వీనర్ చెన్ను నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయనను మహనీయునిగా నిలబెట్టిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పాటుపడ్డ మహనీయుడు లచ్చన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధర రావు, జివి నాగేశ్వరరావు, గుర్రం మురహరి, వాకా వెంకటేశ్వరరావు, బొర్రా సూర్యారాజు, పడమట సాంబయ్య, దేవగిరి రవి శంకర్, పంతాని సాయికుమార్, రేపల్లె సురేష్, వెనిగళ్ల శివసుబ్రహ్మణ్యం, తాడిపర్తి మల్లిఖార్జునరావు, తంగెళ్లమూడి సాయిబాబు, దాసరి అమర్నాథ్, నీలా కోటేశ్వరరావు, బత్తుల గోపిరాజు, బద్దెల సాయిగోపి, కొడాలి సాంబశివరావు, నీలి వెంకయ్య, అమీర్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి: పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు నిరుపమానమైనవని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల పున్నారావు అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకలను బుధవారం చెరుకుపల్లి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ కూడా మాట్లాడారు.

గూడవల్లిలో..

గూడవల్లిలో గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సీఐ కేసన రవి కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలను కొనియాడారు. స్వతంత్ర భారత ఉద్యమంలో గౌతు లచ్చన్న అలుపెరగని పోరాటం చేశారని, ఆయనను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

పోలేరమ్మ కొలుపులకు ఎమ్మెల్యే ఏలూరికి ఆహ్వానం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం చెరుకూరు గ్రామ యానాదులు కాలనీలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే పోలేరమ్మ కొలుపులకు హాజరుకావాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావును కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరిని మర్యాద పూర్వకంగా కలిసి తమ గ్రామాల్లో జరిగే పూజా కార్యక్రమాలకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. యానాదుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి వచ్చిన

ఎమ్మెల్యేని కలిసిన చెరుకూరు యానాదులు

కొండెపి శాసనసభ్యులు డోలా బాల వీరాంజనేయ స్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు తిరుమల శెట్టి శ్రీను, పొట్లూరి సుబ్బారావు, ఇండ్ల శ్రీమాన్, శివ, అంకమ్మ, రాము, నాగేశ్వరరావు, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మీద రోడ్డు..

- ఒంగోలులో పాలకుల విచిత్ర పరిస్థితి
- పర్సంటేజీల కోసం ప్రజాధనం వృథా
- నాడు టిడిపిని విమర్శించి నేడు అదేబాటలో నడుస్తున్న వైసిపి నాయకులు

మాజీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు మీద తారు రోడ్డు వేస్తున్న దృశ్యం (ఫైల్)

మున్సిపల్ ఆఫీసు పక్కన మట్లె వెంకట సుబ్బయ్య రోడ్డు.. విస్తరణ పేరుతో సిమెంటు రోడ్డుమీద సిమెంటు రోడ్డు వేసిన దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

'ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఏం అభివృద్ధి చేశాడు....? రోడ్ల మీద రోడ్లు వేసి పర్సంటేజీలు దండుకున్నారు. అంతకు మించి ఒంగోలులో జరిగిన అభివృద్ధి ఏమి లేదు. మేము వాళ్ల లాగా కాదు. మేం ప్రజలకు ఏం అవసరమో అదే చేస్తాం.' ఇవీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను ఉద్దేశించి ప్రస్తుత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తరచూ చేసే వ్యాఖ్యలు.... అక్కడెక్కడో భాగ్యనగర్‌లో సిమెంట్ రోడ్డుకు గుంతలు పడ్డాయని గత టిడిపి హయాంలో రోడ్డు మీద రోడ్డు వేశారు. సిమెంట్ రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చకుండా రోడ్డు మీద రోడ్డు వేశారంటూ ఆరోడ్డును సాకుగా చూపి నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, నేడు అధికారంలోకి వచ్చిన తరువాత కూడా తెలుగుదేశం పార్టీ నేతల పాలనపై, నాటి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌పై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేటికీ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు.

మరి నేడు.!

సిమెంట్ రోడ్డు మీద గుంతలు లేవు. పాలు కిందపోసి తిరిగి ఎత్తుకునేంత నున్నగా ఉన్న రోడ్ల మీద సిమెంట్, తారు రోడ్లు వేస్తున్నారు. ఒకటి, రెండు చోట్ల కాదు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. బాగాఉన్న రోడ్లను కప్పేసి దానిపై కొత్త రోడ్డు వేస్తుండటంతో స్థానికులు విస్తుపోతున్నారు. ప్రజా ధనం వృథా కావడం చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని..

ఎక్కడో కాదు.. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి నివాసం ఉండే లాయర్‌పేటలో వారి నివాసాల వద్ద సిమెంటు రోడ్లు బాగానే ఉన్నాయి. ఒక్క బాలినేని శ్రీనివాసరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి నివాస ప్రాంతాలే కాదు... లాయర్‌పేటలోని ప్రతి వీధికి సిమెంట్ రోడ్డు ఉంది. దాదాపు అన్నీ వీధులకు మురుగు కాలువలు కూడా ఉన్నాయి. అయితే నగరపాలక సంస్థ అధికారులు, నేతలు ఏం తలచారో...ఏమో...? ఎమ్మెల్యే ఇంటికి పోయే దారి... వచ్చే దారి.. మాజీ ఎంపీ ఇంటికి పోయే దారిలో ఉన్న సిమెంట్ రోడ్డుపై తాజాగా పది రోజుల కిందట తారు రోడ్లు వేశారు. ఇందుకోసం భారీగా ప్రజా ధనాన్ని వెచ్చించారు. బాగున్న సిమెంటు రోడ్డును కప్పేసి తారు రోడ్డు ఎందుకు వేశారో అర్థం కాక ఆప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు.

– మున్సిపల్ ఆఫీసు పక్కనే ఉన్న మట్లె వెంకట సుబ్బయ్య రోడ్డుకు కూడా గతంలో సిమెంటు రోడ్డు ఉంది. అక్కడక్కడ చిన్నచిన్న గుంతలు ఉన్నాయి. అవేమి ఆప్రాంత ప్రజలకు కానీ, అటుగా వెళ్లే వాహనాలకు కానీ ఇబ్బంది కాదు. నిజంగా ఇబ్బంది ఉంటే రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేయవచ్చు. అయితే నగరపాలక సంస్థ అధికారులు ఆ సిమెంటు రోడ్డు విస్తరణ పేరుతో అక్కడ రోడ్డు మీద రోడ్డు వేశారు. ఇందుకోసం కొన్ని లక్షల రూపాయలు వెచ్చించారు.

– 18వ డివిజన్ వెంగముక్కపాలెం సమీపంలోని ఓప్రాంతంలో దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి క్వారీ రబ్బీస్ రోడ్లు వేసేందుకు తాజాగా టెండర్లు పిలిచారు. ఇందులో ప్రధానంగా ఇళ్లు లేనిప్రాంతాలు, ప్రజలు నివాసం లేని ప్రాంతాలు ఉన్నాయి. ఇంకా విచిత్రమేమిటంటే ఓ 'విల్లా' కు దారి వేసేందుకు క్వారీ రబ్బీస్ రోడ్డును టెండర్లలో ప్రతిపాదించడం విశేషం. అందులోనూ ఆ విల్లా పేరును ప్రస్తావిస్తూ టెండర్లను పిలవడం గమనార్హం. ఈ డివిజన్ సాక్షాత్తు ఒంగోలు నగర మేయర్‌ది కావడం కొసమెరుపు. క్వారీ రబ్బీస్ రోడ్డు అంటే గట్టిగా ఒంగోలులో రెండు రోజులు వర్షాలు కురిస్తే కొట్టుకుపోయే పరిస్థితి. మరి ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చించి అక్కడ క్వారీ రబ్బీస్ రోడ్లు వేయాలని అధికారులు ఎందుకు తలచరో...? ఆ డివిజన్ ప్రజలకు సైతం అంటుపట్టని పరిస్థితి నెలకొని ఉంది.

పేదల కాలనీలను పట్టించుకోరేమి...?

నగరంలో పదుల సంఖ్యలో మురికి వాడలు ఉన్నాయి. శివారు కాలనీలు ఉన్నాయి. విలీన గ్రామాలు ఉన్నాయి. ఈ కాలనీలలో మౌలిక వసతులు లేక ఆప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇందిరమ్మ కాలనీ, పక్కనే ఉన్న రాజీవ్ కాలనీ, జర్నలిస్టుల కాలనీ, నేతాజీ కాలనీ, ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలోనే అనేక కాలనీలలో వర్షం వస్తే కనీసం ప్రజలు నడవలేని పరిస్థితులు ఉన్నాయి. అలాంటి కాలనీలలో రోడ్లు వేసి , కాలువలు కడితే జనం హర్షిస్తారు. కానీ మన నేతలు మాత్రం ధనవంతులు, అధికార పార్టీ నేతలు, అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో రోడ్లమీద రోడ్లు వేస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

పర్సంటేజీల కోసమేనా...?

రోడ్లపై రోడ్లు వేస్తే ఖర్చు తక్కువ అవుతోంది. పెద్ద మొత్తంలో కేటాయింపులు చేసి అందులో సగం ఖర్చు చేసి మిగిలింది అధికారులు, నాయకులు నొక్కేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ ప్రాంతంలో ఏ పని చేయాలో గుర్తించడం, అందుకు ముందుగానే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసుకోవడం, వారితో పర్సంటేజీ మాట్లాడుకోవడం. ఆన్‌లైన్ టెండర్లు అయినప్పటికీ నేతలు ఎంపిక చేసిన కాంట్రాక్టర్‌కు సంబంధిత టెండర్ విషయంలో పోటీ లేకుండా చూడటం. అనుకున్న వారికే పని అప్పగించి, ఆ పిమ్మట అందిన కాడికి దోచుకోవడం పరిపాటిగా మారిందని కార్పొరేషన్ వర్గాల్లో చర్చజరుగుతోంది. ఈ తరహా వ్యవహారాలే అధికార పార్టీలో పలువురు కార్పొరేటర్‌లకు ఆదాయ వనరుగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాడు టిడిపి విమర్శించిన వైసిపి నేతలు నేడు అదే మార్గంలో పయనిస్తున్నారని పలువురు చర్చించు కుంటున్నారు. నేతలు చెప్పినట్లు వింటూ అధికారులు కూడా వారి అడుగులకు మడుగులొత్తుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఓటు పరిశీలనపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. తహశీల్దారు కార్యాలయంలో ఓటుహక్కు నమోదు, ఓట్ల పరిశీలనపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ఓట్ల పరిశీలన వేగవంతం చేయాలన్నారు అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు పరిశీలించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు ఎలాంటి ప్రలోబాలకు లోను కాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు అర్హుల ఓట్లను ఎట్టిపరిస్థితుల్లో తొలగించ రాదన్నారు. మృతిచెందిన వారి ఓట్లు తొలగించడానికి పారం నెంబరు 7కు సంబంధించి నోటీసు జారీచేయాలన్నారు. అనంతరం విచారణ జరిగిపి తొలగించాలన్నారు ఈకార్యక్రమంలో తహశీల్దారు సుజన్ కుమార్ ,ఎంపిడిఒ జయమణి, ఎఎస్ఒ శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు, బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల ఎంపిడిఒగా పని చేస్తున్న తాతపూడి సుకుమార్ ఉత్తమ ఎంపిడిఒగా ఎంపికయ్యారు. ఒంగోలు మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సుకుమార్ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు అవార్డు గ్రహీత సుకుమార్‌ను బుధవారం సన్మానించారు.ఈ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది షేక్ మహ బూబ్ బాషా, షేక్ ఖాదర్‌బాషా, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

విద్యుత్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ఎదుట సిఐటియు మార్కాపుర పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫీ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. యాజమాన్యంతో పవర్ జెఎసి కుదుర్చుకున్న చట్టబద్ధత లేని ఒప్పందాన్ని వ్యతిరేకించారు. గ్రేడ్–2 ఉద్యోగుల సమస్యలు , కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం వంటి సమస్యలు పరిష్కరించకుండా పవర్ జెఎసి ఒప్పందం అసంబంధమైనది అన్నారు. తెలంగాణ తరహాలో వేతనాలు పెంచాలన్నారు. ప్రజల నుంచి సర్వీస్ చార్జీల పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తూ, బడా కార్పొరేటర్లకు వేల కోట్ల రూపాయల రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియ జేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మార్కాపురం పట్టణ అధ్యక్షుడు కె. సుబ్బరాయుడు, పి.రూబెన్, టి. గురునాథం, షేక్ ఇమాంసా, కాశయ్య, షేక్ నన్నేసా, జోనా, జబ్బార్, షేక్ యూసఫ్, అంజి పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని బూదవాడ యుపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దిశ పౌండేషన్ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పౌండేషన్ వ్యవస్థాపకులు దరిమడుగు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరాలు తీర్చే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నల్లూరి వెంకటేశ్వరరావు,సర్పంచి జె. మరియమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ ధన్వంతరి, పౌండేషన్ సభ్యుడు రామిశెట్టి కిరణ్, ఉపాధ్యాయులు హసీనా, రమాదేవి, రామకృష్ణారెడ్డి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కనిగిరి

బాల్యవివాహాల రహిత భారత దేశమే మన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్,గుడ్‌హెల్ప్ డైరెక్టర్ మండ్రు రమేష్‌బాబు తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే కష్ట, నష్టాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట ప్రకారం అబ్బాయికి 21,అమ్మాయికి 18ఏళ్లు నిండకుండా వివాహాలు చేయరాదన్నారు. చట్టాలను ఉల్లంగించిన వారికి కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కృష్ణచైతన్య కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

జిఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి

ప్రజాశక్తి-చీమకుర్తి

గొర్రెలకు టీకాలు వేసినందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్న పశువైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో గొర్రెలు,మేకల పెంపకందారుల సంఘం మండల మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సభకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళూరిశ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కిలారి పెద్దబ్బాయి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాగేళ్లు పూర్తయినప్పటికీ పెంపకందారులకు ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. తెలంగాణా తరహాలో సబ్సిడీ రుణాలు ఇస్తామని చెప్పారన్నారు. ఇంతవరకు ఏ ఒక్కరికీ రుణం ఇవ్వలేదన్నారు.నట్టల మందులు ఏడాదికి నాలుగు సార్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కేవలం ఒకేసారి ఇస్తున్నారన్నారు. టీకాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పెంపకందారుల సంక్షేమం మర్చిపోయిందన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారులకు కేటాయించిన నిధులు ఇతర అవసరాలకు వినియోగించడం దుర్మార్గమన్నారు. వృత్తి అభివృద్ధి, సంక్షేమం కోసం ఉచిత బీమా,షెడ్లు ఏర్పాటు, 50 ఏళ్ళకే పింఛను సౌకర్యం పథకం ప్రవేశపెట్టాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోటతిరుపతిరావు మాట్లాడుతూ మండలంలో పశువైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులో లేదన్నారు. డబ్బులు ఇవ్వనిదే వైద్యం చేయడం లేదన్నారు. వైద్య సిబ్బంది టీకాలు వేసినందుకు మూడు నుంచి ఐదు వందలు డిమాండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రతి గ్రామంలో గొర్రెల తాగునీటి కోసం బోర్లు వేసి తొట్లు కట్టించాలన్నారు. ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న కిలారి పెద్దబ్బాయి

నూతన కార్యవర్గం ఎన్నిక

గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా బొడ్డు రామ్మూర్తి, తాళ్ళూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా రావులపల్లి రామాంజనేయులు, మారబోయిన వెంకటరావు, మేడిబోయిన లక్ష్మయ్య, బట్టు శ్రీను, వెంపరాల నాగేశ్వరరావు,కె. ఆంజనేయులు, సిహెచ్. నాగేశ్వరరావు, నుగ్గు శ్రీను, మోరబోయిన శ్రీను, అంజయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పూసపాటి వెంకటరావు, పి. ఆంజనేయులు,కె.చిన్నపురెడ్డి,కె. వెంకటేశ్వర్లు, ఎస్ఎన్‌పాడు మండల కన్వీనర్ కె.జయరామ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 20వ వార్డు పరిధిలోని పుచ్చలమిట్ట, చెంచుల కాలనీలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అమలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని, రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా చింతలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒటిఎస్ (ఒన్‌టైమ్ సెటిల్‌మెంటు)కు సంబంధించి పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనరు వై.మహేష్, వైసిపి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, జెసిఎస్ పట్టణ ఇన్‌ఛార్జి కోటిరెడ్డి, నాయకులు కర్నా భాస్కరరెడ్డి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, హౌసింగ్ ఎఇ అక్బర్‌బాషా, సచివాలయ ఉద్యోగులు,వాలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

గడప గడపకూలో మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం : గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అనేక ప్రయోజనాలు కలిగినట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 17వ వార్డు ప్రజా ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోరు వాటర్ పైప్‌లైన్ అంతటా లేదని, సాగర్ నీరు నాలుగు రోజులకు ఒకసారి వస్తుందన్నారు. బోరు వాటర్ పైప్‌లైన్ వేయించాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి స్పందించారు. తక్షణమే వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, కౌన్సిలర్లు దారివేముల హర్షిత బాబి, దొడ్డా భాగ్యలక్ష్మి, కశ్శెట్టి నగేష్‌కుమార్, బుశ్శెట్టి నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా ఖాశిం, పఠాన్ అమీరుల్లాఖాన్, వైసిపి నాయకులు డాక్టర్ మీర్జా షంషీర్‌అలిబేగ్, షేక్ కరీంబాషా, ఉత్తమ్‌కుమార్, మున్సిపల్ డిఇ షేక్ సుభానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ మణికంఠకు సన్మానం

తర్లుపాడు : మండల పరిధిలోని సీతానాగులవరం సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న బీసా మణికంఠ ఉత్తమ సర్వేయర్‌గా ఎంపికయ్యాడు. ఒంగోలులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మణికంఠ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి తాటికొండ ఆంజనేయులు, సురేపల్లి సర్పంచి నవ్య ఆధ్వర్యంలో మణికంఠను బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ కనకాలు, విఎఒ శంకర్, వెటర్నరీ సిబ్బంది శివప్రియ, విఆర్ఒ రంగారావు, ఎఎన్ఎం సుల్తానా, పిఎస్ బాలకష్ణ, మహిళ కానిస్టేబుల్ లీలావతి, సీతానాగుల వరం విఆర్ఒ రసూల్ పాల్గొన్నారు

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మండల పరిధిలోని నల్లమడుగుల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గ్రామానికి చెందిన బిజ్జముల రమణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి. దుగ్గిరెడ్డి సూర్య నారాయణరెడ్డి కుమారుడు వీర శేఖర్ రెడ్డి బుధవారం రూ.22 వేల విలువైన ప్రింటర్‌ను బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.డేవిడ్ దాతలను అభినందించారు ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

55 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డులో కిలో పొగాకు ధర అత్యధిక రూ.278 పలికింది. మండల పరిధిలోని పొందూరు గ్రామానికి చెందిన రైతులు 1,322 బేళ్లను బుధవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 1,267 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 55 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 278, సరాసరి ధర 262.67 పైసలుగా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సిఎస్‌పురం : మండల పరిధిలోని పెద్ద గోగులపల్లి పాఠశాల అభివద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించినట్లు ఎంఇఒ జె.ప్రసాదరావు తెలిపారు. పెద్ద గోగులపల్లి పాఠశాలలో పనిచేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బి. శివప్రసాదాచారి , జి.రవీంద్ర నారాయణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుబహాన్‌బి అధ్యక్షతన బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 రాజాల కొండారెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు చక్కగా పనిచేసి పాఠ శాలకు మంచి పేరు తెచ్చా రని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యక్ర మంలో వెలిగండ్ల ఎంఇఒ-2 డి. రామిరెడ్డి, ఉపాధ్యాయులు నాయబ్ రసూల్ , ఆనంద్ బాబు, రఫీ, నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఇఒ రమణారెడ్డి

ఆలయ ఇఒ బాధ్యతల స్వీకరణ

సిఎస్ పురంరూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా జి, రమణారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇఒగా పనిచేస్తున్న నర్రా నారాయణరెడ్డిని కొణిజేడు గ్రూపు దేవాలయాల ఇఒగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఈతముక్కల గ్రూపు దేవాలయాల ఇఒగా పనిచేస్తున్న జి.రమణారెడ్డిని నారాయణస్వామి ఆలయ ఇఒ నియమిస్తూ అధికారుల నుంచి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇఒ రమణారెడ్డికి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు మంచి కంటి మధు, ఆలా కొండమ్మ లక్ష్మయ్య, ముడుమాల నారాయణరెడ్డి, పాలపర్తి నారాయణరావు, ఆలయ పూజారులు అభినందనలు తెలిపారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కనిగిరి

నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు కోరారు. సదస్సు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మెగా డిఎస్‌సితో 25వేల పోస్టులు విడుదల చేయాలన్నారు. ,గ్రూప్ 1,2లో 25 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ స్థాయిలో స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ,నిరుద్యోగులకు ఉచిత స్టడీ సర్కిళ్లు,రీడింగ్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. పేఅండ్ ప్లే విధానాన్ని రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన కోచ్‌లను నియమించాలని కోరారు. ప్రతి జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు. వివిధశాఖల్లోని ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కనిగిరి డివిజన్ కార్యదర్శి పి. నరేంద్ర, నాయకులు శివ, నారాయణ, శ్రీను,రవి, టోపివలి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు

నిందితులను శిక్షించాలి

మార్కాపురం రూరల్ : దర్శి మండల పరిధిలోని బొట్లపాలెం గ్రామంలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న దళిత యువడి కుటుంబంపై దాడిని ఎంపిజె రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ ఓ ప్రకటనలో ఖండించారు. ఉత్తర భారతదేశంలో జరిగిన పరువు హత్యలు మన రాష్ట్రానికి పాకడం దురదష్టకరమన్నారు. దళిత యువకుడు అగ్రవర్ణాల అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడనే నెపంతో యువకుడి తల్లి, అక్కలపై పైశాచికంగా దాడిచేసి హతమార్చాలను కోవడం సమాంజసం కాదన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారలు జోక్యం చేసుకొని బాధిత దళిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

పాకలలో పోటా పోటీ ప్రచారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ సర్పంచి ఉప ఎన్నికలకు బుధవారం నుంచి ప్రచారం మొదలైంది. టిడిపి సర్పంచి అభ్యర్థి సైకం చంద్రశేఖర్‌ని గెలిపించాలని కోరుతూ నాయకులు ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి కుర్రు ప్రసన్నకుమార్‌ను గెలిపించాలని కోరుతూ వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ప్రచారం నిర్వహించారు. జనసేన అభ్యర్థి సంకే నాగరాజు ను గెలుపుకోసం ఆ పార్టీ నాయకులు ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. బిఎస్‌పి అభ్యర్థి ఆవుల శ్రీనును గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

త్యాగాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-కనిగిరి

స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులు చేసిన త్యాగాలు,వారి వారసత్వాన్ని యువత ముందుకు తీసుకెళ్లాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు పివి.శేషయ్య కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా ప్రజల సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయన్నారు. స్వాతంత్ర్య ఫలాలు దక్కలేదన్నారు. విద్యార్థులు విద్యలో పూర్తి పరిజ్ఞానాన్ని సాధించాలన్నారు. మరో వైపు సమాజానికి ఎదురతున్న సవాళ్లను గుర్తించి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

శింగరాయకొండ : మండల విద్యాశాఖ అధికారి కార్యాల యంలో ఆర్‌జెడి ఎస్‌వి. సుబ్బారావు ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ నాడు-నేడు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలన్నారు. సచివాలయ అధికారుల పాఠశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి ఏ పాఠశాలలో చేరుతున్నారనే సమగ్ర సమాచారం ప్రధానోపా ధ్యాయుల దగ్గర ఉంచుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ అభివద్ధి కార్యాలయంలో నిర్వహిం చిన సచివాలయ సిబ్బంది సమీక్ష సమావేశంలోనూ ఆర్‌జెడి మాట్లాడారు. సచివాలయాల అధికారులు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఎండిఎస్ కిట్లు పంపిణీ

అర్థవీడు : మండల పరిధిలోని యాచారం సచివాలయం వద్ద ఎఒ మహమ్మద్, సర్పంచి ఆధ్వర్యంలో ఎస్‌సి రైతులకు పిఎండిఎస్ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చునని తెలిపారు. భూమి ఆరోగ్యం బాగుంటే మన ఆరోగ్యం, మన పిల్లల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రవీందర్ రెడ్డి, ఐసిఆర్ పి రైతులు, అధికారులు పాల్గొన్నారు

తహశీల్దారుకు వినతి

సిఎస్ పురంరూరల్ : తాము సాగు చేసుకుంటున్న భూములకు హద్దులు చూపించి, పట్టాదారు పాస్ పుస్తకంలోని తప్పులను సరిచేయాలని కోరుతూ మండల పరిధిలోని బొంతవారిపల్లి గ్రామ రైతులు తహశీల్దారు షేక్ నాగుల్ మీరాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భ:గా రైతులు మాట్లాడుతూ తమకు అధికారులు ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఉన్న సర్వే నెంబర్లు, తాము సాగు చేసుకుంటున్న భూముల సర్వే నెంబర్లు వేర్వేరుగా ఉన్నట్లు తెలిపారు. దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి పట్టాదారు పాస్‌పుక్తంలోని సర్వే నంబర్లు మార్పు చేసి తాము సాగులో ఉన్న భూముల సర్వే నంబర్లు నమోదు చేయాలని కోరారు.

'టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారంటీ'

యర్రగొండపాలెం : రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలన్నా, అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ ఫలాలు అందాలన్నా తిరిగి చంద్రబాబు నాయుడు సిఎం కావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. టిడిపి తోనే భవిష్యత్తుకు గ్యారంటీ అని తెలిపారు. యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం పంచాయతీ పరిధిలోని యల్లారెడ్డి గ్రామంలో మహిళా శక్తి, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి వైసీపీ ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, బోడా చిన్న వీరయ్య, చెవుల అంజయ్య, కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీనివాస్, భాస్కర్, రమణమ్మ పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు నివాళి

ప్రజాశక్తి-చీరాల

చీరాల పట్టణంలోని ముక్కోణం పార్కు వద్ద దళిత మహాసభ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక, విప్లవ గాయకుడు గద్దర్ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియన్ మాట్లాడుతూ గద్దర్ అంటే ఒక మహాసముద్రం లాంటివాడని గుర్తు చేశారు. దళిత పీడిత ప్రజానీకం అభ్యున్నతి కోసం దేశమంతటా గళమెత్తిన విప్లవ జ్వాల గద్దర్ అని అన్నారు. ముఖ్యంగా కారంచేడు ఉద్యమంలో దళితులు భూస్వాములపై చేసిన తిరుగుబాటును చూసి దళిత పులులు విప్లవ గేయాన్ని రాసిన గొప్ప గేయకారుడు గద్దరన్న అని స్పష్టం చేశారు. ప్రజానాట్యమండలి ద్వారా ఎంతోమంది ప్రజలను చైతన్యవంతులను చేసి తమతమ హక్కుల సాధనకై ఉద్యమ జ్వాలను నింపిన గద్దర్ లాంటిని వ్యక్తి మన మధ్యలేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రస్తుతం ఉద్యమాలు చేయడుతున్న అనేకమంది దళిత, ప్రజాసంఘాల నాయకులకు గద్దరన్న లాంటివారే స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంగళరావు, భాస్కరరావు, జిలాని, లక్ష్మణరావు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు బహూకరణ

ప్రజాశక్తి-అద్దంకి

బెంచీలు బహూకరించిన దృశ్యం

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో సింగరకొండ రోడ్ లోని కాకానిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు రూ.19,500 విలువచేసే రెండు ఐరన్ రాక్స్, నాలుగు సిమెంట్ బెంచీలను పాఠశాలకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎన్ గురవయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటుగా విద్యార్థులకు రోటరీ క్లబ్ మౌలిక వసతులను కల్పిస్తోందని అన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు గోరంట్ల లక్ష్మీనారాయణ, గోరంట్ల రవికుమార్, పిఎల్‌వి నరసింహారావు, మల్లాది శ్రీనివాసరావు, నాగయ్య, ఉన్నం శ్రీనివాసరావు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టరు ఉబ్బా దేవపాలన, గోరంట్ల లక్ష్మీనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శ్రీలక్ష్మి, చుండూరి మురళీ సుధాకరరావు, అంజాద్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ విష్ణు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం, దాతలు సమకూర్చిన సౌకర్యాలు సక్రమంగా వినియోగించుకొని విద్యార్థులు బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. విష్ణు పాఠశాల గ్రౌండ్ బాగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. గురవయ్య మాట్లాడుతూ రోటరీ వారు స్కూలుకు ఎంతో సహాయం చేస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం, ఐరన్ రాక్స్ బహూకరించిన దాత సీనియర్ రోటేరియన్ గోరంట్ల లక్ష్మీనారాయణను స్కూల్ సిబ్బంది, రోటరీ వారు ఘనంగా సత్కరించారు.

టిడిపి నాయకుడికి గొట్టిపాటి నివాళి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు(55) అనారోగ్యం తో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందగా, బుధవారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సజ్జాపురం గ్రామం వెళ్లి నాగేశ్వరరావు పార్థివ దేహంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, నాగేశ్వరరావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అన్నారు. నాగేశ్వరరావు ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లప్రోలు రమేష్, అనంతవరపు శ్యాంబాబు, చేవూరి వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, నెంబర్ మౌలాలి, మురళి, పసుపులేటి కోటేశ్వరరావు, అనంతవరపు దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్ బుధవారం పంగులూరు మండలంలోని పలు గ్రామాలలో, ఇటీవల మరణించిన వారి కుటుంబాలను కలిసి పరామర్శించారు. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన జాగర్లమూడి వెంకాయమ్మ మృతి చెందగా, ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం ముప్పవరం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి సభ్యులు కుక్కపల్లి ఏడుకొండలు తల్లి అంజమ్మ ఇటీవల మరణించగా, రవికుమార్ వారి నివాసానికి వచ్చి అంజమ్మ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. మండలంలోని బయటమంజు లూరు గ్రామానికి చెందిన చక్రవరం అప్పలరాజు ఇటీవల మరణించగా, రవికుమార్ వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలియజేశారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బులు

ప్రజాశక్తి-చీరాల

జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేయడంలో భాగంగా ప్రతి పాఠశాలలో, కన్స్యూమర్స్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్చూరు ఉప విద్యాశాఖ అధికారి ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పర్చూరు డివిజనల్ స్థాయి వినియోగదారుల క్లబ్ నిర్వాహకులకు అవగాహన సదస్సు స్థానిక రోటరీ క్లబ్‌లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో తొలుత మేము సైతం శిక్షణ కరదీపికని ఆవిష్కరించారు. డివిజన్‌లోని 110 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బులు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. హైస్కూల్ స్థాయి పిల్లలలో వినియోగదారుల హక్కుల పట్ల సంపూర్ణ అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారు మంచి పౌరులుగా తయారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మేలుకొలుపు సంఘం అధ్యక్షుడు దాసరి ఇమ్మానుయేల్, జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మహమ్మద్, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, వివిధ మండలాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు

మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ పథకాలను ఉపయోగించుకునేలా సహకరించాలని వెలుగు ఏపిఎం లాజరు పేర్కొన్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి సంసిద్ధత వ్యక్తం చేసిన మహిళలందరికీ మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పర్చూరు మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో ఎంపిడిఓ ప్రద్యుమ్నకుమార్, పంచాయతీరాజ్ డిఇఇ విభీషణ్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రజాశక్తి-చీరాల

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మహానాడు వేదికగా ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ఈపురుపాలెం ఇందిరాకాలనీ మెయిన్ బజారులో మహాశక్తి పథకాలను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో అమలు చేయడానికి ప్రతిపాదించిన పథకాలను ఆ ప్రాంత ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో గుద్దంటి చంద్రమౌళి, గుర్రం వెంకటేశ్వర్లు, అందె ఉమామహేశ్వరరావు, అవ్వారు సాంబయ్య, కూరపాటి పూర్ణ, గంజి పురుషోత్తం, శీలం దేవరాజు, పొట్టేటి పాండురంగారావు, సంబారు రాధాకృష్ణ, సాధు లక్ష్మయ్య, సాంబారు రాఘవ, శిరందాసు కాళిదాసు, కందుల వెంకటేశ్వరరావు, కొప్పు రంగారావు, గుర్రం తిరుమల రావు, పఠాన్ గౌస్ ఖాన్, కోటి మోహన్, పాకల పాండు, కొమ్మనబోయిన రజని, యర్రా శివ నాగ మల్లేశ్వరి, నందం లావణ్య, షేక్ ఫర్హాన, పొట్టేటి రాజేశ్వరి, పద్మ శ్రీలక్ష్మి, మునగపాటి జయలక్ష్మి, షేక్ జంగిలి భాస్కర్, వాద్రేవు చిన్న తదితరులు పాల్గొన్నారు.

19న వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని పలు పంచాయతీలలో ఖాళీ అయిన వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె శివపార్వతి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని బేతపూడి పంచాయతీలో 7వ వార్డు, రాజు కాల్వలో 5వ వార్డు, చాట్రగడ్డలో 3, 8 వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందని తెలిపారు. వివిధ వార్డులకు సంబంధించి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ జరిగింది. 14న అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. చాట్రగడ్డ, రాజు కాల్వ గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యాయని బేతపూడి గ్రామంలో దోవాని సువార్త కుమారి అమర్లలూరు సుగుణమ్మ ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నికలు, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రకటన చేస్తారన్నారు. ఈ ఎన్నికలలో పోటీ చేసుకునేందుకు పూర్తి వివరాలకై స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో, ఆయా పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నిత్యావసరాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 27 వసతి గృహాలకు 2023-24 యేడాదికి నిత్యావసర సరుకుల సరఫరాకు గాను తిరిగి సీల్డు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి జె రాజ్ దెబోరా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు షెడ్యూలు ఫారానికి రూ.2 వేలు జిల్లా ఎస్‌సి సంక్షేమ సాధికారత అధికారి, బాపట్ల వారి పేరున తీసిన డిడి 26.08.2023 తేదీ లోగా కార్యాలయ పనివేళల్లో టెండర్ ఫారాలు అందజేయాలన్నారు. ఈఎండి సెక్యూరిటీ డిపాజిట్ల విషయంలో ఎస్‌-ఎస్‌టి యూనిట్ల వారికి ఎటువంటి సడలింపులు లేవన్నారు. షరతులు వర్తిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు బాపట్ల జిల్లా ఎస్‌సి సంక్షేమ సాధికారత అధికారిని సంప్రదించాలని ఆమె తెలిపారు. పూర్తి చేసిన టెండరు కవర్లు ఈ నెల 26న సాయంత్రం 5 గంటల లోగా పై కార్యాలయంలో దాఖలు చేయాలని ఆమె కోరారు.

'హలో లోకేష్'కు బాపట్ల నుంచి ర్యాలీ

ప్రజాశక్తి-బాపట్ల

టిడిపి ర్యాలీ దృశ్యం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సందర్భంగా బుధవారం మంగళగిరిలో జరుగుతున్న హలో లోకేష్ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గం నుంచి వందలాది వాహనాల్లో తెలుగుదేశం శ్రేణులు తరలివెళ్లారు. పాదయాత్రకు సంఘీభావంగా పొన్నూరు మండలం నాగేంద్ర స్వామి పుట్ట వద్ద నరేంద్రవర్మ జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభించారు.

మంత్రి చేతుల మీదుగా ఉత్తమ గ్రంథాలయ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న యామినేని రాంబాబు

గ్రంథాలయ అధికారికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-కొల్లూరు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొల్లూరు శాఖ గ్రంథాలయ అధికారి యామినేని రాంబాబుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ అయిన కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తమ గ్రంథాలయ అధికారి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, బాపట్ల జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో ఉత్తమ గ్రంథాలయాధికారి ప్రశంసాపత్రం అందజేసినందుకు చాలా సంతోషంగా ఉన్నదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ ఉద్యోగ అవార్డుకు ఎంపికైనందుకుగాను చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి శ్రీమతి ఝాన్సీలక్ష్మి, సీనియర్ సహాయకులు ఎం సీతారామయ్య, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కమిషనర్, సీనియర్ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కమిషనర్‌కు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, అద్దంకి ప్రజలకు అందించిన ఉత్తమ సేవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 15న బాపట్ల జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న పురపాలక సంఘం కమిషనర్ బత్తుల శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కలవకూరి చెంచయ్యలకు బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బిసి అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వారిని వారి కార్యాలయంలో కలిసి పూల మాలలతో సత్కరించి అభినందించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు మాట్లాడుతూ అద్దంకి ప్రజలకు మంచి సేవలు అందించే అధికారులు దొరకడం మన అదృష్టమని, వీరిని సత్కరించడం మన బాధ్యత అని అన్నారు. వారు చేసే మంచి కార్యక్రమాలకు ఐక్యవేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు తెలగతోటి రాధాకృష్ణమూర్తి, మదర్సా ప్రిన్సిపల్ సయ్యద్ హుస్సేన్, జ్యోతి డేవిడ్, కొమ్మాలపాటి బుజ్జి, చెన్నుపల్లి నాగేశ్వరరావు, మంచు హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి వారికి బుధవారం అమావాస్య సందర్భంగా దశ సహస్ర కదళీఫలార్చన పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ప్రాతఃకాల సుప్రభాతం గోపూజ బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ తదుపరి వేదపండితులు, అర్చకులు, ఉభయ దాతలు, వేదస్వస్తి మంగళ వాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ, వినాయక స్వామి వారికి, సుబ్రహ్మణ్య స్వామి వారికి జీవధ్వజ ఉద్వహానానికి నారికేళ ఫల సమర్పణ తదుపరి గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం 11 ఆవృత్తములుగా దేవస్థానం వేదపండితులు, అర్చకులు పదివేల అరటి పండ్లతో పూజా కార్యక్రమము నిర్వహించారు. స్వామివారికి మహానివేదన పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరు వాస్తవ్యులు శ్రీ న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ పొనకాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. దేవస్థానం వేదపండితులు, అర్చకులు ఉభయదాతలను, భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని బొట్లపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళలు కామునూరి మౌనిక, జక్కుల అనురాధపై మారణాయుధాలతో దాడి చేసి.. పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి దరిశి గడియారస్తంభం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేసి.. అక్కడ ధర్నా నిర్వహించారు. కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శులు కరువాది సుబ్బారావు, రఘురామ్ మాట్లాడారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు తాండవ రంగారావు అధ్యతగా వహించగా ఐద్వా నాయకులు లక్ష్మి, రాజేశ్వరి, ఎఐటియుసి నాయకులు మాడపాకుల రమేష్, కరుణానిధి, జూపల్లి కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు సందు వెంకటేశ్వరరావు, వెల్లంపల్లి ఆంజనేయులు, రంగనాయకులు, హనుమంత రావు, ఆదినారాయణ, అంజిబాబు, జాన్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నిబంధనల ఉల్లంఘన జరగనీయొద్దు

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓటర్ల జాబితాలో కొత్తగా చేర్పులు, చనిపోయిన వారి పేర్లను తొలగింపు, బదిలీ చేసేటప్పుడు నిబంధనలు ఉల్లంఘన జరగకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఏఎస్. దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహశీల్దార్ మురళితో కలసి త్రోవగుంటలోని 4వ నెంబరు పోలింగ్ కేంద్ర పరిధిలో చేపడుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వ సిబ్బందికి సహకరించాలని ప్రజలకు ఆయన సూచించారు. అనంతరం నాగులుప్పలపాడు మండల కార్యాలయంలో ఎం.పి.డి.ఓ. జయమణి, తహశీల్దార్ సజన్‌కుమార్ ఎన్నికల సూపర్ వైజర్లతో ప్రత్యేకంగా సమీక్షించారు. మండల పరిధిలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ తీరుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేస్తున్న తీరులో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. బిఎల్ఒలకు తగిన శిక్షణ ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన పిటిషన్లపై తక్షణం స్పందించాలి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన పిటిషన్లు మరియు జే.కే.సి కాల్స్‌కు తక్షణం స్పందించాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి వకుల్‌జిందాల్ పోలీస్ అధికారులను హెచ్చరించారు. బుధవారం బాపట్ల ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. పోక్సో కేసులు, గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు, గంజాయి కట్టడికి తీసుకోవలసిన చర్యల గురించి ఎస్పీ సమీక్షించారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ
ఒంగోలు మంగమూరు రోడ్డు నందుగల
అక్షోభ్య వెంచర్స్ & డెవలపర్స్ రియల్ ఎస్టేట్
కార్యాలయం నందు టెలికాలర్‌గా పని చేయుటకు
మహిళా అభ్యర్థిని కావలెను ఇంట్రెస్ట్ ఉన్నవారు
ఈ క్రింది అడ్రస్ కు ఇంటర్వ్యూకు రాగలరు
అర్హతను బట్టి వారికి వేతనం ఇవ్వబడును ..
అక్షోభ్య వెంచర్స్ అండ్ డెవలపర్స్
స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి ఎదురు
మంగమూరు రోడ్ ఒంగోలు
కాంటాక్ట్ నెంబర్స్
9849234029. 9052478100

దళితుల రక్షణకు గాలికొదిలేసిన ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో దళిత మహిళలపై పెత్తందారుల దాష్టీకం జరగడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు, ఒంటరి మహిళలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి రక్షణను గాలికి వదిలేసిందన్నారు. బుధవారం బాపట్లలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రకా శం జిల్లా దర్శిలో దళిత మహిళలను దారుణంగా హింసించారన్నారు. కర్నూలు జిల్లా కోసిగి మండలంలో పొలం నుండి ఇంటికి వస్తున్న మహిళపై ఐదుగురు సామూహిక అత్యాచారం చేశారని ఆ మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిందన్నారు. నిందితులలో ఒక వైసీపీ నాయకుడు ఉన్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రత్యేక న్యాయస్థానాల్లో ఈ తరహా కేసుల పరిష్కారానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చట్టం చేయాలన్నారు. విద్యుత్ బిల్లులు దహన కార్యక్రమాన్ని చేపట్టి సెప్టెంబర్ 1న సచివాలయాల్లో, నాలుగున మండల కార్యాలయంలో మెమోరాండంలు అందజేస్తామన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, మణిలాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమాదేవి

విద్యుత్ పోరాటంపై

ప్రభుత్వ అణచివేత చర్యలను ఖండించండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ కార్మికుల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వ అణచివేత చర్యలను ఖండించాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి ఆరు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు తెలియజేశాయి. స్థానిక ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో బుధవారం కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పివిఆర్ చౌదరి అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ ఎంఎస్ సాయి, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గోగినేని రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

దళిత మహిళపై దాడి అమానుషం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దర్శి మండలం, బొట్లపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళపై పెత్తందారులు అమానుషంగా దాడి చేయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాధితురాలైన మౌనికను బజారు వెంట వీడ్చుకుని వెళ్లి వివస్త్రను చేసి హత్యాయత్నం చేయడమే కాక పెట్రోల్ పోసి దగ్ధం చేసేందుకు దుండగులు ప్రయత్నించారని తెలిపారు. మౌనికపై, ఆమె తల్లి అనురాధపై హత్యాయత్నం చేసి అవమానాలు పాలు చేసిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించండి

విద్యుత్ భవన్ వద్ద సిఐటియు నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా బుధవారం సిఐటియు ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ విద్యుత్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పన పాదయాత్ర సందర్భంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులర్ చేస్తామని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి, న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి సిఐటియు పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రమేష్ తంబి శ్రీనివాసులు, ఎస్ డి హుస్సేన్, ఉదయ్ కిరణ్, నగర నాయకులు రాజా, రాములు, అత్తింటి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, గోపి, సింహాద్రి పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితాపై సర్వే పూర్తయిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా చెప్పారు. ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా సర్వే ప్రక్రియపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్లోని చాంబర్లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సర్వే కార్యక్రమం త్వరలో ముగియనుందని చెప్పారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 3,61,263 లక్షల కుటుంబాలలో సర్వే పూర్తయిందన్నారు. మార్పులు, చేర్పుల కోసం 8,840 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఒక కుటుంబంలోని వ్యక్తులందరికీ ఒక పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కు ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిని కె.లక్ష్మీశివజ్యోతి, ఎన్నికల పర్యవేక్షకులు కష్ణ కాంత్, వైసిపి నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, బి ఎస్ పి నాయకులు కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.